
భగవంతుడిపై నాకు నమ్మకం తక్కువ. బహుశా అందుకు మొదటి కారణం నేను డాక్టర్‌ని కావడం. రెండవ కారణం నా జీవితం మొత్తం మీద దేవుడిని తల్చుకునే అవసరం రాకపోవడం. నేను బంగారు చెంచాని నోట్లో పెట్టుకుని పుట్టానంటారు. నేను చిన్నతనంలో మంచి విద్యార్థిని. యవ్వనంలో మంచి డాక్టర్‌ని, అలాగే మంచి భర్తని, మంచి తండ్రినీ కూడా. ఇప్పుడు ముసలితనంలో ఏం చెయ్యాలో తోచని ఓ నిర్భాగ్య ప్రాణిని.




ఒకప్పుడు నేను బిజీ డాక్టర్‌ని. ఇరవై నాలుగ్గంటలూ రోగులతోనూ, వాళ్ళ రోగాలతోనూ కుస్తీపడుతుండేవాడిని. వయస్సు పెరిగాక డాక్టర్ అయిన నా ఒక్కగానొక్క కొడుకుకి ఆ ప్రాక్టీస్ అప్పగించి చేతులు దులుపుకున్నాను.

అప్పుడు ఎదురయింది ఒక భయంకరమైన ప్రశ్న. ఇక ముందు ఏం చెయ్యాలి? మొదట్లో క్లబ్‌కు వెళ్ళేవాడిని. ఆ తర్వాత ఆ అలవాటు మానుకున్నాను. ఇప్పుడు నా వ్యాపకం ఒక్కటే. నా గదిలో కూర్చుని కిటికీలో నుండి బయటకు చూడటం.

కిటికీ తెరవగానే చుట్టూ ఫ్యాక్టరీ గొట్టాలు; ఆ గొట్టాల నుండి వచ్చే పొగలు విచిత్రంగా వుంటాయి. ఎరను మింగి కదలలేక పడి వున్న కొండచిలువలా తారు రోడ్లు, ఆ రోడ్లపై పరుగులెత్తే కార్లు, వీటన్నింటినీ రోజూ చూడటమే నా పని.

సాయంత్రం అయ్యేసరికి ఎర్రబారే పడమటి దిక్కు, పొంచివున్న శత్రువుల్లా లోకాన్ని కబళించే చీకటిని చూసికాని ఆ కిటికీని నేను మూయను. చెబితే అతిశయోక్తిగా వుంటుందేమో కాని బాల్యంలో నా తల్లి, యవ్వనంలో నా భార్య ఇచ్చిన సంతోషాన్నే ఆ కిటికీ నాకు ఇస్తుంది. అయితే ఇంత ఆనందంలోనూ ఒకే ఒక అపశ్రుతి నా భవనం ప్రక్కనున్న పెంకుటిల్లు.

ఆ ఇల్లు భరద్వాజది. అతను ఒక ప్రభుత్వ ఉద్యోగి. అతనికి అందమైన భార్య, ముత్యాల్లాంటి ఇద్దరు పిల్లలు వున్నారు. ఆ భరద్వాజ వల్లనే నాకు చాలా అసౌకర్యంగా వుంది. భరద్వాజ ఒక తాగుబోతు. ఎంత తాగుబోతంటే తన శరీరంలోని మూత్రపిండాలని కూడా అమ్ముకుని తాగే సేటంతటి తాగుబోతు.

ప్రశాంత ప్రభాతాలు, ఆహ్లాదకరమైన సాయంత్రాలు, సుఖమయమైన జీవితాలు చూసే నాకు భరద్వాజ కుటుంబాన్ని చూస్తే ఏవగింపు. రోజు రాత్రి అయ్యాక అతను తాగి రావడం, భార్యా పిల్లలను కొట్టడం, వాళ్ళు ఏడవడం ఇదంతా నా ప్రశాంత జీవనానికి అవరోధంగానే వుంది.

భరద్వాజ భార్య పేరు శారద. ఆ అమ్మాయి చదువుకుందట. మరి భర్తను ఎందుకు అదుపుచెయ్యలేకపోతుందో నాకు అర్థం కాదు. ఒక రోజు వాళ్ళ పిల్లలిద్దరూ ఎవరింటికో భోజనాలకు వెళ్ళారట. పెళ్ళి కదా, ఎవరూ గుర్తుపట్టరులే అనుకుని వుంటారు. కాని అక్కడి వాళ్ళు గమనించి మధ్యలోనే బయటకు గెంటేశారు. అది తెలిసి శారద పిల్లలిద్దరినీ కొడుతోంది. సరిగ్గా ఆ సమయంలోనే భరద్వాజ తూలుకుంటూ వచ్చాడు.

భార్య చెప్పింది విని పిల్లలను కొట్టాడు. ఆ తర్వాత ఇంట్లో వంట చెయ్యలేదని భార్యని కొట్టాడు. ఆమె పిల్లలను చెరోవైపు అక్కున చేర్చుకుని అక్కడే చాలాసేపు ఏడుస్తూ కూర్చుంది. ఇటువంటి సన్నివేశాలు చూడటం నాకు ఇష్టముండదు. కాని తప్పడం లేదు. నా కిటికీ చూపించే సన్నివేశాలలో అది ఒకటి.

నిజానికి భరద్వాజకి వచ్చే జీతంతో ఆ కుటుంబం చాలా హాయిగా బ్రతకవచ్చును. కాని భరద్వాజ వ్యసనం వాళ్ళను దారిద్ర్యరేఖకు దిగువున వుంచుతుంది. భరద్వాజకు వచ్చిన జీతమంతా మొదటి వారం బారుల్లో ఖర్చుపెడతాడు. ఆ తర్వాత నుండి గవర్నమెంట్ సారా ప్యాకెట్లపై ఖర్చుపెడతాడు. అక్కడి నుండి అప్పుల కొరకు వీధుల్లో పడతాడు. తన జీతంలో ఒక్క పైసా కూడా ఇంట్లో ఇవ్వడు. పాపం శారద మిషన్ కుట్టుకుని కుటుంబాన్ని పోషిస్తుంది. ఇంతకంటే నికృష్టమైన జీవితాలుంటాయని నేను అనుకోను.

ఇటీవల టొరంటోలోని యార్క్ వుడ్స్ పబ్లిక్ లైబ్రరీలో Indian and International Names పుస్తకావిష్కరణ జరిగింది. ఈ విధంగా పిల్లల పేర్లు అర్థాలు కూడా వ్రాసి ప్రచురించటం ఉత్తర అమెరికా భారతీయ చరిత్రలో ప్రథమంగా చోటు చేసుకున్న అంశం. ఈ పుస్తకాన్ని అద్వైత స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీమతి యాండ్రియా కిబేడి ఆవిష్కరించారు. అందరికీ ఉపయోగమైన పుస్తకం అని సంతోషాన్ని వ్యక్తం చేశారు.

మాతృ వాత్సల్యాన్ని తన కళ్ళద్వారా తెలుపుతున్న తల్లి, ఆ ఆనందామృతాన్ని గ్రోలుతున్న తనయుడూ వున్న ముఖచిత్రం ఈ పుస్తకానికి శోభను చేకూర్చింది. ఈ పుస్తకానికి ఎడిటర్ డా. ఎ. సుదర్శనరాజ్, కో-ఎడిటర్ శ్రీ బొబ్బిలి విజయారావ్, పబ్లిషర్ శ్రీమతి కె. సరోజ.




ఎన్నోమార్లు ఒరలు లేని నూతి దగ్గర కూర్చుని ఏడుస్తున్న శారదను చూసి ఎప్పడో ఈమె ఆ నూతికి బలయిపోతుంది అనుకునేవాడిని. మృత్యువు నోటిలా విశాలంగా వుండే ఆ నూతిని చూస్తే నాకు ఒళ్ళు జలదరిస్తుంది.

* * *

ఆ రోజు ప్రొద్దుట నుండి నాకు వంట్లో బాలేదు. భోజనం కూడా చెయ్యబుద్ధికాలేదు. వయస్సు పెరిగేకొద్దీ ఇటువంటివి సహజమే కదా? పైగా బయట వాతావరణం కూడా మబ్బుగా వుంది. చలిగాలి వీస్తుంది. ఆ కిటికీ దగ్గరే కూర్చుని బయటకు చూస్తున్నాను.

హఠాత్తుగా వర్షం మొదలైంది. సన్నగా పూల జల్లులా పడుతున్న వానజల్లునూ, తడుస్తున్న నల్లటి తారురోడ్లను, హడావిడిగా తిరుగుతున్న మనుష్యులను చూస్తున్నాను.

ఇంతలో భరద్వాజ ఇల్లు నన్ను ఆకర్షించింది. ఈ విషయంలో మాత్రం నాపై నాకే జాలివేస్తుంది. వద్దన్నకొద్దీ నా దృష్టి ఆ ఇంటి పైకే వెళుతుంది. ఎందుకో నాకే తెలీదు.

అక్కడ భరద్వాజ ఇల్లు అమ్మేస్తానని, కాగితాలపై సంతకాలు పెట్టమని అడుగుతున్నాడు. చెప్పొద్దు నాకు చాలా ఆనందం కలిగింది. ఇల్లు అమ్మేస్తే ఈ మాయదారి సంత వదులుతుంది.

కాని శారద ఒప్పుకోవడం లేదు, ఆ ఇల్లు ఆమెకు పుట్టింటి నుండి సంక్రమించిన ఆస్తి కాబోలు. అమ్మవద్దని, పిల్లలకు నిలువ నీడ వుండదని. బ్రతిమలాడుతుంది. ఆమె ఏడుపు హృదయవిదారకంగా వుంది. బొక్కెనకున్న తాడు విప్పదీసి దాంతో ఆమెను కొట్టసాగాడు. ఆ అమ్మాయిని చంపెయ్యడు కదా? అని భయం వేసింది. అతని ముఖంలో రాక్షసత్వం రానురాను పెరిగిపోతుంది. పోనీ ఈ శారదైనా పెట్టెయ్యవచ్చు కదా? మొండితనం చేస్తుంది.

హఠాత్తుగా భరద్వాజ శారదను వదిలి ఇంట్లోకి వెళ్ళాడు. పిల్లలను చెరో చేత్తో బాతుపిల్లలను తెచ్చినట్లు తెచ్చాడు. ఆ చిన్న పిల్లల పీకలు నొక్కుతూ కోపంగా అరుస్తున్నాడు. వెళ్ళి ఆపుదామా అనుకున్నాను. కాని నన్ను చూస్తే మామూలు మనుష్యులు భయపడతారు. ఆ తాగుబోతు కేం భయం. అందుకే వెళ్ళలేదు.

ఈలోపున శారద పిల్లలను విడిపించుకోవడానికి గింజుకుంటుంది. ఆమె కావాలనే తోసిందో, భరద్వాజ ప్రారబ్ధం అలా వుందో తెలీదుకాని ఆ పెనుగులాటలో తల్లక్రిందులుగా బావిలో పడిపోయాడు.

ఉలిక్కిపడి లేచాను. గబగబా క్రిందకు పరుగెట్టాను. అప్పటికే ఆ ఇంటి దగ్గర చాలా మంది గుంపుగా చేరి వున్నారు. "ఇంటాయన బాగా తాగేసి ఆ మైకంలో నూతిలో పడి చచ్చిపోయాడట" ఎవరో ఎవరితోనో అంటున్నారు.

కాదు, అతని భార్యే హత్య చేసింది. అతన్ని నూతిలోకి తోసి చంపేసింది. బిగ్గరగా అరిచి చెపుదామనుకున్నాను. కాని నాలో అంతర్మదనం ప్రారంభమయింది. ఆమెకు నేను ఎప్పడూ ఏ సహాయం చెయ్యలేదు. ఇంతకు ముందు ఆ తాగుబోతు ఆమె పిల్లలను చంపబోతుంటే వెళ్ళి ఆపలేకపోయాను. పిల్లలను రక్షించుకునే ప్రయత్నంలో శారద ఈ హత్య చేసింది. ఆఫ్టరాల్ కోడిపెట్ట కూడా తన పిల్లలను రక్షించుకోవడానికి గ్రద్దలతోటి, డేగలతోటి ప్రాణాలకు తెగించి పోరాడుతుంది. ఎంతైనా శారద మనిషి కదా?

పైగా నేను డాక్టర్ని. ఒక వ్యక్తి శరీరంలో పాడైన అంగాన్ని తొలగించి మిగిలిన అవయవాలను రక్షించడం అనే ప్రక్రియ నా విధి నిర్వహణలో చాలాసార్లు చేశాను. ఆ కుళ్ళిపోయిన భాగాన్ని తీసివేయకపోతే మొత్తానికి మొదటికే మోసం వస్తుంది. ఇప్పడు శారద కూడా అదే పని చేసింది. అలా చెయ్యడం తప్పకాదనే నాకు అనిపించింది.

భరద్వాజ ఉద్యోగం శారదకు ఇచ్చారు. ఇప్పడు వాళ్ళు కడుపు నిండా తింటున్నారు. వంటి నిండా బట్ట కడుతున్నారు. చక్కగా చదువుకుంటున్నారు. భరద్వాజ భార్య, పిల్లల దారిద్ర్యం అతనితోనే పోయింది.

* * *

ఇప్పడు నేను ఆ కిటికీ తెరవడం లేదు. తెరిస్తే ప్రకృతి అందాలతో పాటు విధి వికృత చేష్టలు కూడా కనబడుతున్నాయి. ముక్కుపచ్చలారని పసివాళ్ళు బూట్లు పాలిష్ చెయ్యడం, కన్నబిడ్డ పాల కోసం ఆడవాళ్ళు వ్యభిచారం చెయ్యడం నేను చూడలేకపోతున్నాను.

అందువల్లనే సమాజమనే ద్వారానికి గల నిజం అనే కిటికీని శాశ్వతంగా మూసివేసాను. కాలకూట విషం లాంటి నిజాన్ని భరించే శక్తి నాకు లేదు.

భారత, అంతర్జాతీయ
పిల్లల పేర్ల గైడ్

